క్లుప్తంగా

22వ వార్డులో 'వైఎస్సార్ కంటి వెలుగు'



వృద్ధులకు కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు అనిత

మద్దిలపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలో శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ అనిత ఈ కార్యక్రమంలో పాల్గొని కంటి పరీక్షలు చేశారు. ఈ శిబిరానికి వార్డులోని 7 సచివాలయాలలో పరిధిలో ఉన్న 48 మంది రాగా.. ఐదుగురికి కేటరాక్ట్ సమస్య ఉన్నట్టు గుర్తించామని డాక్టర్ అనిత తెలిపారు. వారికి ప్రభుత్వ రీజనల్ కంటి ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయనున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 7 సచివాలయ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బ్యాంకింగ్, బీమా రంగాల సేవలపై ముగిసిన శిక్షణ



ముగింపు సభలో మాట్లాడుతున్న ఆచార్యుడు శ్యామ్‌కుమార్

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విద్యార్థులకు 45 రోజులుగా బ్యాంకింగ్, బీమా రంగాల సేవలపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు బ్యాంకింగ్, బీమా రంగాలపై అవగాహన అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.వి జయబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి సిహెచ్.విష్ణుమూర్తి, సాఫ్ట్ స్కిల్ ట్రైనర్ ఉషా మాధురి, కె.రవిబాబు, సిహెచ్.లలిత పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలని ర్యాలీ



ర్యాలీ చేస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ మద్దిలపాలెం జోన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎంవీపీ కాలనీ రైతుబజార్ నుంచి డీఆర్‌డీఏ సర్కిల్ వరకు శుక్రవారం ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరమణ మాట్లాడుతూ ఈ నెల 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ నాయకులు శ్రీను, కొండమ్మ, సీఐటీయూ సీనియర్ నాయకుడు అనపర్తి అప్పారావు, పీఎస్ఎం జిల్లా నాయకుడు ఎం.చంటి, తదితరులు పాల్గొన్నారు.

బీవీకే కాలేజీకి వితరణ

ఆరిలోవ: విశాలాక్షినగర్‌లోని బీవీకే జూనియర్ కాలేజీకి పంజాబ్ నేషనల్ బ్యాంక్ సహకారంతో రెండు వాటర్ ప్యూరిఫైలు అందజేశారు. రోటరీ క్లబ్ ఎలైట్ ఆధ్వర్యంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ వీటిని కాలేజీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం కోసం శుద్ధమైన తాగునీరు అందించడం అభినందనీయమన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఉదయ్‌రెడ్డి, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్లు లలిత్ జైన్, రాథోడ్, ప్రెసిడెంట్ శ్రీనివాస్, బీవీకే ప్రిన్సిపాల్ రామ పాల్గొన్నారు.

గీతంలో అంతర్జాతీయ విద్యార్థుల సందడి

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ విద్యార్థుల యువజనోత్సవం సంయుక్త-23 శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. వర్సిటీలో వివిధ కోర్సులు అభ్యసిస్తున్న పలు దేశాల విద్యార్థులు సందడి చేశారు. సంగీత, నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

బోటింగ్‌పై వేసవి ప్రతాపం!



జూలో ఎండిపోయిన సరోవర్ కొలను



కంబాలకొండ కొలనులో సందర్శకులు లేక ఒడ్డున ఖాళీగా ఉన్న బోట్లు

- కంబాలకొండలో ఒడ్డుకు పరిమితమైన బోట్లు
- జూ పార్కుపై కూడా భానుడి ప్రభావం

ఆరిలోవ: వేసవి ఎండలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఉదయం 10 గంటల నుంచే భానుడి ప్రభావం ఎక్కువగా ఉండడంతో పర్యాటక ప్రాంతాలకు సందడి తగ్గిపోతోంది. జాతీయ రహదారి పక్కన జూ పార్కు ఎదురుగా ఉన్న కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో ఎండ ప్రభావం కనిపిస్తోంది. సందర్శకులు లేకపోవడంతో కొద్ది రోజులుగా ఇక్కడ బోటింగ్ వెలవెలబోతోంది. ఇక్కడ కయాకింగ్, టబ్ బోట్లు, మినీ బోట్లు(ఇద్దరేసి వెళ్లేవి) తదితర రకాలకు చెందిన 12 బోట్లు ఉన్నాయి. సందర్శకులు లేకపోవడంతో అవన్నీ ఇప్పుడు ఒడ్డుకే పరిమితమయ్యాయి. రోజులో 10 నుంచి 15 మంది వరకు మాత్రమే వీటిని వినియోగిస్తున్నట్లు కంబాలకొండ సిబ్బంది తెలిపారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత ముదిరితే ఈ కొలనులో నీరు తగ్గిపోయి బోటింగ్ నిర్వహణకు కూడా వీలుపడని పరిస్థితి నెలకొంటుందని అంటున్నారు.

జూలో ఎండిపోయిన కొలను

జూ పార్కులో ఉన్న సరోవర్ కొలను పూర్తిగా ఎండిపోయింది. భానుడి ప్రతాపానికి ఇందులో నీరు ఇటీవల పూర్తిగా ఆవిరైపోయింది. ప్రస్తుతం ఈ కొలను బీటలువారి కనిపిస్తోంది. చుట్టు పక్కల తడి లేకపోవడంతో పచ్చని మొక్కలు కూడా ఎండిపోతున్నాయి. సాధారణంగా ఈ కొలనులో నీరు ఉన్నప్పుడు సందర్శకులకు చల్లదనంతో ఆహ్లాదకరంగా ఉండేది. దీని ఒడ్డున జూ అధికారులు ఏర్పాటు చేసిన పూల పార్కులో సందర్శకులు కొంతసేపు సేదదీరేవారు. ఈ కొలను ఒడ్డుకు బయట నుంచి వచ్చే వివిధ రకాల పక్షులు సందర్శకులకు కనువిందు చేసేవి. ఇప్పుడు ఈ కొలను ఎండిపోవడంతో వాటి రాక తగ్గిపోయింది.

ప్రజల్లోకి విస్తృతంగా ప్రభుత్వ పథకాలు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల
- 'జగనన్న మా భవిష్యత్తు'పై సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న పంచకర్ల రమేష్

బీచ్ రోడ్డు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు కోరారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో శుక్రవారం తూర్పు నియోజకవర్గం సచివాలయ కన్వీనర్లతో జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల ఒకటి నుంచి 5వ తేదీలోపు సచివాలయ కన్వీనర్లు అందరూ గృహసారథులతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. 7వ తేదీ నుంచి సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న ప్రభుత్వం అందిస్తున్న పథకాల కోసం వివరించాలన్నారు. అలాగే గత ప్రభుత్వానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి తేడాను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గం పరిశీలకుడు సూర్యనారాయణరాజు, తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

శిలాజ ఇంధనాల వినియోగం తగ్గించండి



కరపత్రాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మద్దిలపాలెం: శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించాలని గ్రీన్ క్లైమెట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం పిలుపునిచ్చారు. శుక్రవారం శివాజీపాలెంలోని పలు పాఠశాలలో శిలాజ ఫూల్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిలాజ ఇంధనాలు భారీ మొత్తంలో కార్బన్ డయాక్సైడ్ విడుదల చేస్తాయన్నారు. ఇది పర్యావరణానికి ప్రమాదకరమని తెలిపారు. శివాజీపాలెం హెచ్ఎం కుమారి భూగ్రహాన్ని కాపాడుకోవడానికి శిలాజ ఇంధన వినియోగాన్ని తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వనిత, ఉపాధ్యాయుడు చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై సామగ్రి ఇలా.. రాకపోకలెలా?



పిఠాపురం కాలనీలో ప్రధాన రహదారికి అడ్డంగా వేసిన భవన నిర్మాణ సామగ్రి

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డు మద్దిలపాలెం కూడలి నుంచి ఆంధ్రా బ్యాంకు మీదుగా పిఠాపురం కాలనీలోని ప్రధాన రహదారిపై భవన నిర్మాణ సామగ్రి నిల్వ చేయడంతో రాకపోకలకు ఇబ్బందవుతోంది. శ్లాబ్ నిర్మాణానికి సంబంధించి మిక్సర్‌ను రోడ్డుపై పెట్టి పనులు చేస్తుండడంతో కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. దీనిపై సచివాలయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ప్రధాన రహదారులపై భవన నిర్మాణ సామగ్రి వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

160 కేజీల గంజాయి పట్టివేత

అక్కిరెడ్డిపాలెం: నిషేధిత గంజాయిని గాజువాక పోలీసులు పట్టుకున్నారు. గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆటోనగర్ డీ బ్లాక్‌లోని సెఫ్ ఎక్స్‌ప్రెస్ పార్సిల్ గొడౌన్‌కు ఇసుకతోటకు చెందిన ఒక ఆటో డ్రైవర్ తన ఆటోలో పార్సిల్ చేసిన 160 కేజీల గంజాయిని తీసుకువచ్చారు. గంజాయిని తరలిస్తున్నారన్న సమాచారంతో గాజువాక పోలీసులు గొడౌన్ వద్దకు చేరుకుని ఆటోను స్వాధీనం చేసుకుని, ఆటోడ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి రవాణాపై ఆటోడ్రైవర్ నుంచి వివరాలు సేకరించగా కరాసలో ఒక వ్యక్తి ఆటోనగర్ పార్సిల్ సర్వీసుకు బేరం మాట్లాడడని తెలిపాడన్నారు. దీంతో గంజాయిని తీసుకువచ్చిన అసలు వ్యక్తి పరారీలో ఉండగా, ఆటోడ్రైవర్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దోమల నివారణకు డ్రైడే తప్పనిసరి



ఆరిలోవ ఆపరేషన్ కాలనీలో డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ సిబ్బంది



పిఠాపురం కాలనీలో ఫ్రైడే డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డులో శుక్రవారం శానిటరీ, మలేరియా విభాగం అధికారులు డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఆపరేషన్ కాలనీలో అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం స్థానికులకు పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల గురించి వివరించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ కెల్ల సునీత మాట్లాడుతూ దోమల నివారణకు వారంలో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఇంట్లో తడి, పొడి చెత్త వేరుచేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. నీటి ట్యాంకులు, కుండీలలో నీరు నిల్వుండకుండా జాగ్రత్త పడాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, శానిటరీ, మలేరియా విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలపై అప్రమత్తత అవసరం

మహారాణిపేట: మాతాశిశు మరణాలపై అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. శుక్రవారం రేసవానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో మాతృ, శిశు మరణాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. మూడు మాతృ మరణాలు, 11 శిశు మరణాలు జరిగాయని, భవిష్యత్తులో ఇలాంటి మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గర్భిణీగా నమోదైన నాటి నుంచి ప్రసవించే వరకు సేవలు సక్రమంగా అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ రమేష్ కిషోర్, కేజీహెచ్ గైనకాలజిస్టు డాక్టర్ విద్యారమ, డాక్టర్ రేణుక, ఎనాస్థీషియాలజీస్టు డాక్టర్ గణేష్, డాక్టర్ నాయుడు, బి.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

'నివాసిత ప్రాంతాలు వదిలి రక్షణ గోడ నిర్మించాలి'



15వ వార్డులో దుర్గానగర్ కొండపై రక్షణ గోడ పనులు నిలిపివేయాలని కోరుతున్న కాలనీవాసులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు దుర్గానగర్ కొండపై నివాసముంటున్న ప్రాంతాలను వదిలి పెట్టి సింహాచలం దేవస్థానం రక్షణ గోడ పనులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు. హుద్‌హుద్‌కు ముందు దుర్గానగర్ కాలనీ 6.8 ఎకరాల స్థలంలో ఉండేదని కాలనీవాసులు చెప్పారు. గతంలో ఇక్కడ పనిచేసిన సింహాచలం ఈవో సూర్యకళ ఇక్కడ సర్వే చేసినప్పుడు 6.8 ఎకరాలను వదిలేసి రక్షణ గోడ నిర్మాణానికి మార్కింగ్ చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆకస్మికంగా దేవస్థానం సిబ్బంది జేసీబీలో వచ్చిన రక్షణ గోడ నిర్మాణ పనులు గ్రామస్తులుంటున్న ఆరు ఎకరాల ప్రాంతంలో శుక్రవారం చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు పనులు అడ్డుకున్నారు. స్థానిక కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గిరిబాబుల దృష్టికి తీసుకెళ్లారు. వారు వచ్చి దుర్గానగర్ కాలనీవాసుల సమస్యలు తెలుసుకున్నారు. ప్రస్తుతానికి రక్షణ గోడ నిర్మాణ పనులు నిలిపివేయాలని సిబ్బందికి సూచించారు. ఈ విషయాన్ని దేవస్థానం అధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని గ్రామస్తులకు వారు భరోసా ఇచ్చారు. దీంతో గ్రామస్తులు, సిబ్బంది అక్కడి నుంచి వెళ్లిపోయారు.

జగనన్న సంక్షేమంతో ప్రతి ఇంటా అభివృద్ధి

- వీఎంఆర్‌డీఏ ఛైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల
- 19వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న అక్కరమాని విజయనిర్మల, తదితరులు

ఎంవీపీ కాలనీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా అభివృద్ధి జరుగుతుందని వీఎంఆర్‌డీఏ ఛైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అన్నారు. 18వ వార్డులో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అంజయ్యనగర్ పరిధిలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి ధనలక్ష్మితో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లి పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. ఎన్నికల హామీలో భాగంగా ఒక పక్క అవ్వాతాతల పెన్షన్ పెంచుతూనే రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యాదీవెన వంటి పథకాల ద్వారా ప్రతి ఇంటా పిల్లలు నాణ్యమైన విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ప్రజలకు వైద్యం, విద్యా చేరువ చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్ అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. నాడు- నేడు కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్ పాఠశాలలకు దీటుగా ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు నిలుస్తున్నాయన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే అందరి బాధ్యత

ఎంవీపీ కాలనీ: డ్రగ్స్ రహిత సమాజం అందరి బాధ్యత కావాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బులి కృష్ణ అన్నారు. మాదక ద్రవ్యాల వ్యసనం, ఇతర సంబంధిత సమస్యలపై అవగాహన కల్పించేందుకు జిల్లా అధికారులతో శుక్రవారం ఎంవీపీ కాలనీ సెక్టార్-9లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ప్రత్యేక సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత సాంకేతికంగా ముందంజలో ఉన్నారన్నారు. అయితే ఆ సాంకేతికత చెడు వ్యసనాలకు దారితీసే విధంగా ఉండకుండా చూడాలన్నారు. విద్యార్థి దశలో చదువులో రాణించేలా తల్లిదండ్రుల నుంచి ఉపాధ్యాయులు, అధికారుల వరకు అందరూ ప్రోత్సహించాలన్నారు. యువతకు డ్రగ్స్ దరిచేరనీయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు లక్ష్యంగా అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. చదువుతో పాటు క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాల దిశగా ముందుకు నడిపించాలన్నారు. ఈ సదస్సులో జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామమూర్తి, ఐసీడీఎస్ నోడల్ అధికారి ఎం.శశికళ, విద్యా, వైద్య, పోలీసు, ఎక్సైజ్, కార్మిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం...

నైపుణ్యాల పెంపే లక్ష్యంగా సదస్సుల నిర్వహణ



సదస్సును ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ శశిభూషణరావు

ఏయూ క్యాంపస్: విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించే దిశగా సదస్సుల నిర్వహణ జరగాలని ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. శుక్రవారం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో నిర్వహించిన 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ సివిల్ ఇంజినీరింగ్ మెటీరియల్స్ అండ్ ప్రాక్టీసెస్'సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వర్తమాన జ్ఞానాన్ని అందించే విధంగా సదస్సు నిర్వహించడం శుభపరిణామమన్నారు. విభాగాధిపతి ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సంప్రదాయ విధానాలు, అధునాతన పద్ధతులపై అవగాహన కల్పించారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ తీసుకువస్తున్న నియమావళిని స్వాగతిస్తామన్నారు. ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజినీరింగ్ చైర్మన్ ఆచార్య డి.ఎస్.ఆర్.మూర్తి నిర్మాణ రంగంలో సవాళ్లు, విధానాలు అంశంపై ప్రసంగించారు. విభాగ పూర్వ ఆచార్యులు జి.వెంకటప్పారావు జియో సింథటిక్స్, మెటీరియల్స్, రీయిన్‌ఫోర్స్‌డ్ సాయిల్ స్ట్రక్చర్స్, నేల స్వభావాల ఆధారంగా నిర్మాణాలు తదితర అంశాలను వివరించారు. జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాల ఆచార్యులు ఎం.జనార్దన్ యాదవ్, ఐఐటీ మద్రాసు ఆచార్యుడు జి.అప్పారావు, డీజీఎన్‌పీ చీఫ్ ఇంజినీర్ బ్రిగేడియర్ సురేష్ రామనాథన్, 200 మందికిపైగా ప్రతినిధులు పాల్గొన్నారు.

స్మారకోపన్యాసం నిర్వహణ



రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగంలో ఆచార్య టి.ఎం.రాధాకృష్ణ, భారతిల స్మారక ఉపన్యాసాన్ని శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఆచార్య రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి పూర్వ సంచాలకుడు డాక్టర్ డి.రఘునాథరావు క్యాన్సర్ నివారణలో నూతన విధానాలు అంశంపై ప్రసంగించారు. ఆచార్య టి.ఎం.రాధాకృష్ణ జీవిత విశేషాలను ఆచార్య వి.లక్ష్మి వివరించారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ చార్య కె.శ్రీనివాసరావు, ఆచార్య జి.సుధాకర్, ఆచార్య జ్యోత్స్న, ఆచార్య టి.రాఘవరావు, ఆచార్య పి.రాధిక, ఆచార్య సుభాషిణిదేవి పాల్గొన్నారు.

సుభాష్‌కు జాతీయ స్థాయి అవార్డు



సుభాష్‌ని అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల విద్యార్థి ఎస్.సుభాష్ జాతీయ స్థాయిలో బెస్ట్ యూత్ అవార్డు పొందారు. ఇటీవల హరియాణాలో జరిగిన జాతీయ స్థాయి యూత్ రెడ్ క్రాస్ క్యాంప్‌లో 17 దేశాల నుంచి 44 విశ్వవిద్యాలయాలకు చెందిన 187 మంది క్యాడెట్‌లు పాల్గొన్నారు. వారిలో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన సుభాష్ జాతీయ స్థాయిలో ఉత్తమ యూత్ అవార్డ్ సాధించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో సుభాష్‌ను అభినందించారు. విద్యార్థి దశ నుంచి సేవా భావం అలవరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బాలల సంక్షేమానికి సమష్టి కృషి అవసరం

ఏయూ క్యాంపస్: చైల్డ్‌లైన్ నోడల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రిసోర్స్ ఆర్గనైజేషన్‌పై జిల్లా స్థాయి సమావేశం శుక్రవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఐఏఎస్ఈలో నిర్వహించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ బాలల సంక్షేమం, భద్రతలో విభిన్న ప్రభుత్వ శాఖలు, ఎన్‌జీవోలు సమష్టిగా పని చేయాలని సూచించారు. బాలల హక్కులను కాపాడం, అమలు చేయడంలో రాజీ పడవద్దన్నారు. వార్డు సచివాలయ సిబ్బందిని భాగస్వాములను చేస్తూ పనిచేస్తే బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో అరికట్టడం సాధ్యపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.వెంకటేశ్వరి, ఏయూ ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, ఆర్.పూర్ణిమదేవి, ఎం.ఆర్.ఎల్ రాధిక, ఎల్.ప్రగ్యన్ కుమార్, నోడల్ సమన్వయకర్త జి.సూరిబాబు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలతో బంగారు భవిత

- ఆర్జేడీ జ్యోతికుమారి
- అడవివరం జెడ్పీ హైస్కూల్ సందర్శన



ట్యాబ్‌లను పరిశీలిస్తున్న జ్యోతి కుమారి

సింహాచలం: పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలకు బాటలు వేసుకోవాలని విద్యార్థులకు ఆర్జేడీ జ్యోతికుమారి సూచించారు. అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆమె శుక్రవారం సందర్శించారు. పాఠశాలకు సంబంధించిన అకడమిక్, నాన్ అకడమిక్ అంశాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులంతా శ్రద్ధగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులతో పాటు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని బాధ్యత కలిగిన పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా 8వతరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను పరిశీలించారు. ఉపాధ్యాయులు నోట్ బుక్స్ కరెక్షన్స్, సిలబస్ పూర్తి చేశారా...లేదా...అన్న విషయలపై ఆరా తీశారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు ప్రభావతి, ఉపాధ్యాయుడు మల్లికార్జునరావు పదోతరగతి పిల్లలకు సమకూర్చిన అట్టలు, పౌచ్‌లు, పెన్నులు, పెన్సిళ్లను ఆమె అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రి నాగార్జునను కలిసిన విద్యార్థి నాయకులు



మంత్రి నాగార్జునకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏయూ విద్యార్థి నాయకులు

ఎంవీపీ కాలనీ: మంత్రి మేరుగు నాగార్జునను ఏయూ ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల విద్యార్థి నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. నగర పర్యటనలో ఉన్న మంత్రిని ఓ అతిథిగృహంలో శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాలతో పాటు యువత సీఎం జగన్‌కు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్, వి.శ్యామ్ సుందర్‌నాయుడు, డాక్టర్ రాజకుమార్, గణేష్ పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో శిక్షణకు ఆహ్వానం

బీచ్ రోడ్డు: చిన్నారుల సౌకర్యార్థం సమ్మర్ స్విమ్మింగ్ క్యాంపును నొవొటెల్‌లో ఏర్పాటు చేశారు. 5 నుంచి 12 ఏళ్ల వయస్సు కలిగిన చిన్నారులకు నెల రోజుల పాటు స్విమ్మింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే ఈ శిక్షణ కార్యక్రమం రెండు బ్యాచ్‌లుగా నిర్వహించనున్నారు. ఆసక్తి ఉన్న వారు 79890 45422 నంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.